రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్
వార్త



## నీట్ పేపర్ లీకేజీకి నిరసనగా విద్యాసంస్థల బంద్



**షాద్‌నగర్, జులై 24, ప్రభాతవార్త :** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీట్ పేపర్ లీకేజీ ఘటనపై కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ తెలంగాణ వ్యాప్తంగా విద్యార్థి సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు నిర్వహించిన విద్యాసంస్థల బంద్ విజయవంతమైందని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సభ్యుడు ఆకాష్ నాయక్, ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు వడ్ల శ్రీకాంత్, ఎన్ఎస్ యూఐ నాయకులు బిలాల్, బీసీ జనసేన విద్యార్థి విభాగం నాయకులు అఖిల్ తెలిపారు. రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు స్వచ్ఛందంగా బంద్‌కు సహకరించడం విద్యార్థుల ఆందోళనకు లభించిన మద్దతుకు నిదర్శనమని వారు పేర్కొన్నారు. నీట్ పరీక్షల నిర్వహణలో చోటుచేసుకున్న అవకతవకలు, పేపర్ లీకేజీలపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాట మాడే విధంగా పరీక్షల నిర్వహణలో నిరక్ష ్యం ప్రదర్శించడం బాధాకరమని విమర్శించారు. విద్యా వ్యవస్థలో పారదర్శకత, విశ్వసనీయతను కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలని, విద్యార్థుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. బంద్‌కు సహకరించిన విద్యార్థులు, ఉపాధ్యా యులు, విద్యాసంస్థల యాజమాన్యాలకు విద్యార్థి సంఘాల నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ టౌన్ ఉపాధ్యక్షులు అదిల్, ఎస్ఎఫ్ఐ నాయకులు చరణ్, శివ రాంచరణ్, రోహిత్, సృజన్, వంశీ, రహన్, ప్రవీణ్, వికాస్, ఏఐఎస్ఎఫ్ నాయకులు నూతన్, హర్షిత్, గణేష్, పవన్, సాయి చవాన్ తదితర విద్యార్థి సంఘాల నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## డ్రైవర్ నిర్లక్ష్యానికి చిన్నారి బలి

### ఇంటి ముందే కాటేసిన స్కూల్ బస్సు
### కాస్లాబాద్‌లో తీవ్ర విషాదం
### యాజమాన్యంపై చర్యలకు డిమాండ్

**చౌదరిగూడ, జులై 24, ప్రభాతవార్త:** చౌదరిగూడ మండలంలో శుక్రవారం ఓ విషాద ఘటన చోటుచేసుకుంది. కాస్లాబాద్ గ్రామానికి చెందిన కృష్ణయ్య-మనీష దంపతుల కుమార్తె సహస్ర (యూకేజీ) స్థానిక అబ్యాస్ విద్యాపీఠం పాఠశాలలో చదువుతోంది. ప్రతిరోజులాగే ఉదయం స్కూల్ బస్సులో పాఠశాలకు వెళ్లిన చిన్నారి, సాయంత్రం ఇంటి వద్ద దించే సమయంలో జరిగిన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయింది. స్థానికుల వివరాల ప్రకారం...బస్సు ఇంటి వద్ద ఆపిన అనంతరం చిన్నారి దిగిన కొద్దిసేపటికే డ్రైవర్ నిర్లక్ష్యంగా వాహనాన్ని వెనక్కి తీసే ప్రయత్నం చేశాడు. ఆ సమయంలో సహస్ర బస్సు వెనుక భాగంలో ఉండటాన్ని గమనించకపోవడంతో బస్సు ఆమెను ఢీకొట్టింది. తీవ్ర గాయాలపాలైన చిన్నారిని స్థానికులు వెంటనే షాద్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందినట్లు నిర్ధారించారు. చిన్నారి మృతితో కాస్లాబాద్ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. సహస్ర కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు తీవ్ర ఆవేదనకు వ్యక్తం చేశారు. ఘటనకు స్కూల్ బస్సు డ్రైవర్ నిర్లక్ష్యమే కారణమని ఆరోపిస్తూ స్థానికులు, విద్యార్థి సంఘాల నాయకులు ఆందోళనకు దిగారు. స్కూల్ యాజ మాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని, బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి చట్టపరమైన శిక్షలు విధించాలని వారు డిమాండ్ చేశారు. విద్యార్థుల రవాణాలో భద్రతా ప్రమాణాలు తప్పనిసరిగా అమలు చేయాలని, బస్సుల వద్ద సహాయక సిబ్బందిని నియమించాలని కూడా కోరారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకున్నారు.

## ప్రజా సమస్యలపై లడాయి!

**షాద్‌నగర్, జులై 24, ప్రభాతవార్త :** "తెలంగాణ వచ్చాక రెండుసార్లు టిఆర్ఎస్‌కు మరోసారి కాంగ్రెస్‌కు ప్రజలు అవకాశం ఇచ్చి.. వీరి పాలనతో విసిగిపోయారు. అందరి గుండెల్లో ఇప్పుడు బిజెపి ఉంది. సర్వేల ప్రకారం వచ్చే ఎన్నికల్లో రంగారెడ్డి జిల్లాలో బిజెపి క్లీన్ స్వీప్ చేయబోతోంది. ప్రజల సమస్యలపై కార్యకర్తలు లడాయికి సిద్ధం కావాలి. రోడ్లపై రాకుండా సమావేశాలు, సభలు నిర్వహించుకుంటే ఏమీ ఫలితం ఉండదు" అని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రారావు పార్టీ నేతలకు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. షాద్ నగర్ పట్టణంలోని ఏబి కాంప్లెక్స్‌లో జిల్లా అధ్యక్షులు రాంభూపాల్ గౌడ్ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన రంగారెడ్డి జిల్లా బిజెపి కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని భవిష్యత్ వ్యూహంపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..భారతదేశంలో అల్లర్ల కోసం విదేశీ కుట్రలను చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. వాటిని తిప్పికొట్టేందుకు దేశభక్తులై యువత పెద్ద ఎత్తున ఉద్యమించాలని పిలుపునిచ్చారు. నీట్ ప్రశ్న పత్రాల లీకేజీలో కాంగ్రెస్ నాయకులు కూడా ఉన్నారని ఆరోపించారు.

ఇండియా కూటమి ప్రభుత్వం ఉన్న సమయంలో అనేక పేపర్ లీకేజీలు జరిగాయని, అప్పుడు ఎవరైనా రాజీనామా చేశారా? అని ప్రశ్నించారు. పేపర్ లీకేజీ అంశం ముసుగులో కావాలనే దేశాన్ని విచ్ఛిన్నం చేయాలని రాహుల్‌గాంధీ చూస్తున్నారన్నారు. కాక్రోచ్ జనతా పార్టీ ఉద్యమానికి నిర్దుష్టమైన దారే లేదని ఎద్దేవాచేశారు.

ఉద్యమాన్ని ఎవరు పక్కదారి పట్టిస్తున్నారనేది కెమెరాలు చూస్తే తెలుస్తుందని వ్యాఖ్యానించారు. ఆ పార్టీ పేరుతో నిర్వహించిన చలో పార్లమెంట్ వెనుక ఎవరున్నారో ప్రజలు గమనించాలని కోరారు. సుప్రీంకోర్టు సీజేఐ చేసిన కామెంట్స్ నచ్చక సీజేఐని అవమానపరచడానికి ఒక వ్యక్తి కాక్రోచ్ జనతా పేరుతో పార్టీ పెట్టాడని రాంచందర్ రావు గుర్తుచేశారు.

సీఎం రేవంత్ రెడ్డి, బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇద్దరు ఒకటేనని వీరిద్దరూ కలిసి రాష్ట్రంలో రాజకీయ డ్రామాలు ఆడుతున్నారని విమర్శించారు. దేశంలో ఏం జరిగినా వీరిద్దరూ ఒక్కటే ఆందోళనలకు దిగుతారని, అలాంటి ఉదాహరణలు ఎన్నో ఉన్నాయని చెబుతూ.. రైతు చట్టాల వ్యవహారాన్ని గుర్తు చేశారు. ప్రధాని మోడీని బద్నాం చేసేందుకు ఆడుతున్న డ్రామా రాష్ట్రంలో అందరికీ తెలుసన్నారు. యువత విద్యార్థుల జీవితాలతో కాంగ్రెస్ బిఆర్ఎస్ ఆటలాడుకుంటోందని ఆరోపించారు. కాక్రోచ్ జనతా పార్టీతో కాంగ్రెస్ కలిసి దేశంలో విధ్వంసం సృష్టిస్తున్నారని ఆరోపించారు.



ప్రజా వ్యతిరేక పాలనపై సమరానికి సిద్ధం కావాలంటూ షాద్‌నగర్ సభలో అభిమానులు బహూకరించిన కత్తిని ప్రదర్శిస్తున్న రామచంద్రరావు

- ✦రోడ్లపైకి రాకుండా సమావేశాలతో ప్రయోజనం లేదు
- ✦టిఆర్ఎస్, కాంగ్రెస్‌తో జనం విసిగిపోయారు ✦ఈసారి బిజెపికే ఛాన్స్
- ✦వర్సిటీలలో ఖాళీల భర్తీ కోసం రేవంత్ సర్కారుపై యువత ఒత్తిడి తేవాలి
- ✦దేశంలో అల్లర్ల కోసం విదేశీ కుట్రలకు వ్యతిరేకంగా ఉద్యమించండి
- ✦బిజెపి నేతలకు పార్టీ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు పిలుపు



హాజరైన బిజెపి నేతలు, కార్యకర్తలు



బిజెపి లడాయి పోస్టర్ ఆవిష్కరిస్తున్న రామచంద్రయ్య

**బిజెపి లడాయి పోస్టర్ ఆవిష్కరణ**

ఫీజు రియింబర్స్మెంట్ నిధుల విడుదల కోసం ఫీజుల బకాయి.. బిజెపి లడాయి పోస్టర్‌ను రంగారెడ్డి జిల్లా కార్యకర్తల సమావేశం సందర్భంగా విడుదల చేశారు. విద్యాశాఖను తన వద్దనే పెట్టుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యార్థులకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని రామచంద్రరావు ఆరోపించారు.

యూనివర్సిటీలలో ఖాళీల భర్తీ మాట ఏమిటని అదేవిధంగా 1000 కోట్లు కేటాయిస్తామని మాట తప్పారని మండిపడ్డారు. ఇందుకోసం ఉద్యమాలు ఉవ్వెత్తున చేసి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ఇంచార్జ్ రఘునాథ్ మాజీ జిల్లా అదక్షలు బొక్క నర్సింహా రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, కేఎస్ రత్నం, మాజీ ఎంపీ బూర నర్సింహా గౌడ్, తోకల శ్రీనివాస రెడ్డి, అందెల శ్రీరాములు యాదవ్ కొప్పు భాషా, నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి, అందే బాబయ్య, అర్జున్ రెడ్డి, శ్రీధర్, దేపల్లి అశోక్ గౌడ్, నర్సింహా గౌడ్, వెంకటేష్ గుప్తా, మల్లారెడ్డి, అంజన్ కుమార్ యాదవ్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సమావేశ ఉద్దేశించి స్థానిక నేతలు కక్కునూరి వెంకటేష్ గుప్తా, వంశీకృష్ణ, మురళి, మహిళా కార్యకర్తలు రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## శంషాబాద్‌లో నకిలీ విమాన టికెట్ల కలకలం

### ఇద్దరు నేపాలీయుల అరెస్ట్

**శంషాబాద్, జులై 24, ప్రభాతవార్త :** శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో నకిలీ విమాన టికెట్ల వ్యవహారం కలకలం రేపింది. దుబాయ్ వెళ్లేందుకు ఎయిర్‌పోర్ట్‌కు వచ్చిన ఇద్దరు నేపాల్ జాతీయులను సీఐఎస్ఎఫ్ అధికారులు తనిఖీ చేయగా, వారి వద్ద ఉన్న విమాన టికెట్లు నకిలీవని గుర్తించారు. అనుమానం రావడంతో టికెట్లను సంబంధిత ఎయిర్‌లైన్ రికార్డులతో పరిశీలించిన అధికారులు అవి చెల్లని టికెట్లని నిర్ధారించారు. వెంటనే ఇద్దరినీ అదుపులోకి తీసుకుని ఎయిర్‌పోర్ట్ పోలీసులకు అప్పగించారు. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. నకిలీ టికెట్లను వారికి ఎవరు అందించారు? ఈ వ్యవహారం వెనుక అంతర్జాతీయ మోసగాళ్ల ముఠా లేదా ట్రావెల్ ఏజెన్సీల ప్రమేయం ఉందా? అనే కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నారు. విమానాశ్రయంలోని సీసీటీవీ ఫుటేజీని పరిశీలిస్తున్న అధికారులు, నిందితుల మొబైల్ ఫోన్లు, ప్రయాణ పత్రాలు, ఆన్‌లైన్ బుకింగ్ వివరాలను స్వాధీనం చేసుకుని విశ్లేషిస్తున్నారు. ఈ ఘటనలో మరికొందరి ప్రమేయం ఉన్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దర్యాప్తు పూర్తయిన తర్వాత నిందితులను కోర్టులో హాజరుపరచనున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనతో అంతర్జాతీయ ప్రయాణాల్లో నకిలీ టికెట్ల మోసాలపై మరోసారి అప్రమత్తంగా ఉండాలని అధికారులు ప్రయాణికులకు సూచిస్తున్నారు.



ఎన్యూమరేషన్ పత్రాలు అందిస్తున్న వజ్రేశ్‌యాదవ్

### అర్హుల ఓటు హక్కును పరిరక్షించి..
## దొంగ ఓట్లను ఏరేద్దాం
### సర్ ప్రక్రియకు సహకరించాలి- బిఎల్‌ఓలకు డిసిసి చీఫ్ పిలుపు

**కీసర, జులై24,ప్రభాతవార్త:** ఓటరు జాబితాలో ఎస్ఐఆర్ ప్రక్రియకు ప్రజలందరూ సహకరించాలని మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. శుక్రవారం ఘట్‌కేసర్ సర్కిల్ నాగారం డివిజన్ పరిధిలోని రాంపల్లిలో నిర్వహించిన సర్ సమీక్షా సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతి ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అలాగే ఇంటింటి ధృవీకరణ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించి అర్హులైన ఓటర్ల పేర్లు తొలగిపోకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని బిఎల్ఓ, బిఎల్ఏలకు సూచించారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటరు జాబితా సవరణ అత్యంత కీలకమైన ప్రక్రియ అని పేర్కొన్నారు.

రాజకీయాలకు అతీతంగా నిర్వహిస్తున్న ఈ ప్రక్రియను రాజకీయ నాయకులకు సైతం అవగాహన కల్పించాలని వారందరూ సహకారం అందించి దొంగ ఓట్లను, డబుల్ ఓట్లను తొలగించే ప్రక్రియకు తోడ్పటునివ్వాలని కోరారు. ప్రజాస్వామ్య ప్రక్రియలో విద్యావంతులు, యువత వివిధ ప్రజా సంఘాల భాగస్వామ్యం కావాలని పటిష్టమైన దేశ నిర్మాణానికి కార్యోన్ముకులు కావాలని కోరారు.

ఈ కార్యక్రమంలో నాగారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎల్లసాని భూమయ్య యాదవ్, డివిజన్ సర్ ప్రోగ్రాం ఇంఛార్జి బొమ్మలపల్లి నరసింహులు, మేడ్చల్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఈత శ్వేత రాజు ముదిరాజు, మాజీ వైస్ చైర్మన్ బండారు మల్లేష్ యాదవ్, మాజీ కౌన్సిలర్‌లు మాదిరెడ్డి వెంకట్‌రెడ్డి, పంగ హరిబాబు, మాజీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముప్పు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్.కుమార్, మాజీ సర్పంచ్ అసోక్‌గౌడ్, మాజీ ఉప సర్పంచ్ మణిపాల్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కౌకుట్ల జీవన్‌రెడ్డి, అన్నంరాజు సురేష్, సుర్వి శ్రీనివాస్, ర్యాల అనిల్, కార్యకర్తలు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.




వివరాలు వెల్లడిసిస్తున్న డిసిపి శ్రీధర్

### హౌస్‌లోన్ల ఆశ చూపించి
## 4.11 కోట్లకు టోపీ
### నకిలీ స్థిరాస్థి పత్రాలతో వల
### నిందితుల ముఠా అరెస్ట్

**కీసర, జులై 24, ప్రభాతవార్త:** గృహరుణాలు వివిద బ్యాంకుల నుండి ఇప్పిస్తామని నమ్మబలికి హౌసింగ్ ఫైనాన్స్ సంస్థలను మోసం చేసి 4.11 కోట్ల రూపాయలు మోసం చేసిన ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. శుక్రవారం కీసర పోలీస్‌స్టేషన్‌లో మల్కాజిగిరి డిసిపి శ్రీధర్,ఏసిపి చక్రపాణి, సిఐ ఆంజనేయులు, డిఐ ఎస్ఐ అనిల్‌లు కలిసి విలేఖరుల సమావేశంలో మాట్లాడారు.

ప్రధాన సూత్రదారి శ్రీనివాస్‌రావు, బోయిన్‌పల్లికి చెందిన వేణుగోపాల్, బుర్ర మహేష్ యాదవ్, మంజుల, డాక్యుమెంట్ రైటర్‌లు నాగరాజు, శ్రీశైలం, దినేష్, భరత్‌లు ముఠాగా ఏర్పడి నకిలీ తారుమారు చేసిన స్థిరాస్థి పత్రాలను సృష్టించి ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న వ్యక్తులను రుణ గ్రహీతలుగా వినియోగించి వివిద బ్యాంకులు, హౌసింగ్ ఫైనాన్స్ సంస్థల నుంచి గృహరుణాలు తీసుకుని భారీ మోసం చేశారన్నారు. అప్పటి సబ్ రిజిస్టార్ నకిలీ రిజిస్ట్రే షన్లకు సహకరించినట్లు పేర్కొన్నారు.స్థలాలు లేని వాటికి సైతం పత్రాలు సృష్టించి రుణాలు పొందా రన్నారు. ఇందులో మొత్తం 29 మంది ఉండగా 8 మందిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు.

నేరానికి సంబంధించిన మొబైల్ ఫోన్లు, నకిలీ పత్రాలు, సేల్ డీడ్ల పత్రాలు, జీపిఏ పత్రాలు, బ్యాంకు రుణాలకు సంబందించిన దరఖాస్తులు ఇతర కీలక డాక్యు మెంట్లను స్వాధీనం చేసుకున్నారు. మిగితా వారిని కూడా త్వరలోనే అరెస్ట్ చేస్తామని తెలిపారు. ఇప్పటివరకు 9 గృహరుణాల ద్వారా రూపాయలు 4.11 కోట్లు మోస పూరితంగా పొందినట్లు విచా రణలో వెల్లడైందన్నారు.

## మరో 10 రోజులే గడవు

### ఓటు హక్కును కాపాడుకోండి- సర్ ప్రక్రియపై కలెక్టర్ అప్రమత్తం

**రంగారెడ్డిఅర్బన్, జులై 24,ప్రభాతవార్త:** ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమం తుది దశకు చేరుకుంది. గడువు ముగియడానికి ఇంకా పది రోజులు మాత్రమే మిగిలి ఉండటంతో రంగారెడ్డి జిల్లా ఎన్నికల యంత్రాంగం అప్రమత్తమైంది. ఇప్పటివరకు ఎన్యూమరేషన్ ఫారాలను పూర్తి చేసి సంబంధిత బూత్ లెవల్ ఆఫీసర్ (బీఎల్‌వో)లకు అందజేయని ఓటర్లు వెంటనే స్పందించాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సి. నారాయణ రెడ్డి విజ్ఞప్తి చేశారు. గడువులోగా ఫారాలు సమర్పించకపోతే ఎన్నికల సంఘం నిబంధనల మేరకు ఓటరు జాబితాలో పేరు తొలగే అవకాశం ఉంటుందని హెచ్చరించారు.

భారత ఎన్నికల సంఘం దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ కార్యక్రమం ద్వారా ఓటరు జాబితాను పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేస్తున్నారు. అర్హులైన ప్రతి ఓటరి వివరాలను మరోసారి ధృవీకరించడం, చిరునామా మార్పులు, కుటుంబ వివరాలు, అవసరమైన సవరణలు నమోదు చేయడం, జాబితాను పారదర్శకంగా రూపొందించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష ్యంగా ఉంది. ఈ ప్రక్రియలో భాగంగా ప్రతి ఓటరికి ఎన్యూమరేషన్ ఫారాలు అందజేస్తుండగా, వాటిని పూర్తిగా నింపి బీఎల్‌వోలకు తిరిగి అందజేయాలని ఎన్నికల అధికారులు సూచిస్తున్నారు. జిల్లా ఎన్నికల అధికారి సి. నారాయణ రెడ్డి మాట్లాడుతూ, ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువులోగా ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించని వారి పేర్లపై ప్రత్యేక పరిశీలన జరుగుతుందని తెలిపారు. అవసరమైన ధృవీకరణ అందకపోతే నిబంధనల ప్రకారం ఓటరు జాబితా నుంచి పేరు తొలగించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. అందువల్ల చివరి నిమిషం వరకు వేచి చూడకుండా వెంటనే ఫారాలు సమర్పించాలని సూచించారు.జిల్లాలో ఎన్యూమరేషన్ ప్రక్రియ కొనసాగుతున్నప్పటికీ ఇంకా గణనీయమైన సంఖ్యలో ఓటర్లు ఫారాలు సమర్పించాల్సి ఉందని అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం జిల్లా సగటు పురోగతి 57.70 శాతం మాత్రమే నమోదైంది.



## నెలరోజులో విద్యార్థులకు యూనిఫాంలు ఇవ్వాలి

### సిఎస్ సంజయ్ జాజు ఆదేశం

**రంగారెడ్డిఅర్బన్, జులై 24, ప్రభాతవార్త:** ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాల్లో చదువుతున్న విద్యార్థులకు రెండు జతల ఏకరూప దుస్తులను ఆగస్టు 25లోగా అందించేలా అన్ని జిల్లాలు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, విద్య, గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ శాఖల అధికారులు, ఇతర సంబంధిత శాఖల అధికారులతో కలిసి యూనిఫాం పంపిణీ, ఖరీఫ్ పంటల సాగు, ఎల్‌నినో ప్రభావం, సీజనల్ వ్యాధుల నివారణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాల్లో ప్రతి విద్యార్థికి రెండు జతల యూనిఫాంలు నిర్ణీత గడువులోగా అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థుల కొలతలు సేకరించడం, మాస్టర్ టైలర్లను గుర్తించడం, స్వయం సహాయక సంఘాల మహిళల ద్వారా యూనిఫాంల కుట్టింపు వేగవంతం చేయాలని ఆదేశించారు.



## మైనర్ చేతిలో 10కిలోల గంజాయి!

### ఒడిసా నుంచి రవాణా
### కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో పట్టివేత

**తాండూరు, జులై 24, ప్రభాతవార్త :** వికారాబాద్ జిల్లా తాండూరులో 10కిలోల ఎండు గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. గుట్టుగా బ్యాగులో ఎండు గంజాయిని తరలిస్తున్న ఓ మైనర్ బాలుడిని పక్కా ప్లాన్‌తో పోలీసులు అదుపులోకి తీసుకొని గంజాయిని స్వానం చేసుకున్నారు. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిస్సా రాష్ట్రానికి చెందిన ఓ 17 ఏళ్ల మైనర్ బాలుడు కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో గంజాయి రవాణా చేస్తూ తాండూరు రైల్వే స్టేషన్‌లో దిగాడు.

అయితే, విశ్వసనీయ సమాచారం మేరకు తాండూరు రూరల్ సీఐ ప్రవీణ్ కుమార్ రెడ్డి సిబ్బందితో కలిసి తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో మైనర్ బాలుడి వద్ద ఉన్న బ్యాగును పరిశీలించగా అందులో పెద్ద ఎత్తున ఎండు గంజాయి లభించింది.

సుమారు రూ.2లక్షల విలువైన 10కిలోల ఎండు గంజా యిని స్వాధీనం చేసుకొని సీజ్ చేశామని, మైనర్ బాలుడిని అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు వెల్లడించారు.



స్వాధీనం చేసుకున్న గంజాయి



షేడ్ నెట్ పంటల సాగును పరిశీలిస్తున్న కలెక్టర్ దీపక్ తివారీ

## షేడ్ నెట్ సాగుతో 30 శాతం అదనపు దిగుబడి

**వికారాబాద్, ప్రభాతవార్త :** షేడ్ నెట్ పంటలతో అధిక లాభాలు సాధించవచ్చని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. శుక్రవారం వికారాబాద్ మండలం మదనపల్లి గ్రామంలో ఉద్యానశాఖ ఆధ్వర్యంలో ఎంఐడీహెచ్ పథకం కింద సెర్ఫ్ డీఆర్‌డీఓ సహకారంతో మహిళా రైతు ఎస్. అలివేలు 400 చ.మీ. విస్తీర్ణంలో ఏర్పాటు చేసుకున్న షేడ్‌నెట్‌లో సాగు చేస్తున్న చామంతి పంటను జిల్లా కలెక్టర్ సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, షేడ్‌నెట్‌లో సాగు చేయడం వల్ల చీడపీడల ఉధృతి గణనీయంగా తగ్గడమే కాకుండా, వాతావరణ ప్రభావం కూడా తక్కువగా ఉంటుందని తెలిపారు. బహిరంగ సాగుతో పోలిస్తే 25-30 శాతం అధిక దిగుబడి సాధించడంతో పాటు, నాణ్యమైన ఉత్పత్తి ద్వారా రైతులు మెరుగైన ఆదాయం పొందే అవకాశం ఉంటుందని వివరించారు. ఉద్యానశాఖ ఎంఐడీహెచ్ పథకం ద్వారా 400 చ.మీ. షేడ్‌నెట్ యూనిట్‌కు రూ.2 లక్షలు వ్యయం కాగా, అందులో 50 శాతం సబ్సిడీ రైతులకు అందజేయబడుతుందని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని అధిక విలువ కలిగిన ఉద్యాన పంటల సాగును చేపట్టాలని సూచించారు. పంటల మార్పిడిలో భాగంగా తక్కువ నీటితో అధిక ఆదాయాన్ని అందించే పూలు, కూరగాయలు, పండ్లు, ఆయిల్ పామ్ వంటి ఉద్యాన పంటలను సాగు చేయాలని రైతులకు సూచించారు. డీఆర్‌డీఓ సహకారంతో మహిళా సంఘాలకు సోలార్ క్రాప్ డ్రయ్యర్లు ఏర్పాటు చేసి, ఉద్యాన పంటల ఉప ఉత్పత్తులు, విలువ ఆధారిత ఉత్పత్తులను తయారు చేయడం ద్వారా మహిళా సంఘాలకు అదనపు ఆదాయం కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్ (ట్రైనీ) సచిన్ భస్వరాజ్, జిల్లా ఉద్యాన పట్టు పరిశ్రమల అధికారి ఎం.ఏ.సత్తార్, డీఆర్‌డీఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## డంపింగ్ యార్డు అవగాహన సదస్సు

**డీసీసీ అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్‌కు ఆహ్వానం**

**జవహర్‌నగర్, జులై 24, ప్రభాత వార్త:** రాంకీ చెత్త డంపింగ్ యార్డు ఎత్తివేత డిమాండ్‌తో ఈనెల 26న జవహర్ నగర్‌లో నిర్వహించనున్న పర్యావరణ పరిరక్షణ, ఆరోగ్య భద్రత, జీవించే హక్కుపై అవగాహన సదస్సుకు మేడ్చల్ డీసీసీ అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్‌ను జవహర్‌నగర్ డంపింగ్ యార్డు ఎత్తివేత పోరాట కమిటీ ప్రతినిధులు ఆహ్వానించారు. చంద్రపురి కాలనీ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లెపల్లి శ్రీకాంత్ ఆధ్వర్యంలో పోరాట కమిటీ ఛైర్మన్ షేక్ షావలి, కోశాధికారి పి. శివబాబు కలిసి వజ్రేష్ యాదవ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి సదస్సుకు హాజరు కావాలని కోరారు. ఈనెల 26, ఆదివారం స్వర్ణాంధ్రా డీఎన్ఆర్ ఫంక్షన్ హాల్‌లో జరగనున్న ఈ అవగాహన సదస్సులో రాంకీ డంపింగ్ యార్డు వల్ల ఏర్పడుతున్న పర్యావరణ, ఆరోగ్య సమస్యలు, ప్రజల జీవించే హక్కు పరిరక్షణ వంటి అంశాలపై చర్చించనున్నట్లు కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రమేష్ చారి, బూడిద వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## క్యాన్సర్ బాధితులకు ఆర్థిక సహాయం



ఆర్థిక సహాయం అందజేస్తున్న బిఆర్ఎస్ నేతలు

**ఆమనగల్లు, జులై24, ప్రభాతవార్త:** క్యాన్సర్ వ్యాధి బారినపడి చికిత్స పొందుతున్న ఇద్దరు చిన్నారులకు ఎన్ఆర్ఐ బిఆర్ఎస్ విభాగం నేత కోట్ల సాయిబాబా ఆర్థిక సహాయం అందజేశారు. కల్వకుర్తి నియోజకవర్గంలోని గుండూరు, తోటపల్లి గ్రామానికి చెందిన హిరంష్, శ్రీనివాస్‌లను వ్యాధితో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. శుక్రవారం బిఆర్ఎస్‌పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటిఆర్ జన్మదినం పురస్కరించుకుని గిఫ్ట్ ఏస్మైల్ కార్యక్రమం క్రింద ఆయన వీరాభిమాని ఆమనగల్లు మండలం శెట్టిపల్లి గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ కోట్ల సాయిబాబా ప్రతి ఏడాది సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. అందులో భాగంగానే ఈఏడాది క్యాన్సర్ బాధితులకు ఆర్థిక సహాయం అందజేశారు. ఒక్కొక్కరికి రూ. 10వేల చొప్పున రూ. 20వేలు స్నేహితుల ద్వారా అందించారు. ఈమేరకు ఇద్దరు చిన్నారులను ఫోన్‌లో పరామర్శించి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో జగదీశ్‌రెడ్డి, చరణ్‌రెడ్డి, అశోక్, శశంక్ తదితరులు ఉన్నారు.

## వాహనాల వేలంలో రూ.లక్ష ఆదాయం



వేలం పాట నిర్వహిస్తున్న ఎక్సైజ్ అధికారులు

**ఆమనగల్లు, జులై24, ప్రభాతవార్త:** ఆమనగల్లు ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు శుక్రవారం ప్రభుత్వం వేలం పాట నిర్వహించింది. వేలం నిర్వహించగా లక్షకు పైగా ఆదాయం లభించింది. డిప్యూటీ కమిషనర్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ రంగారెడ్డి డివిజన్ ఆదేశానుసారం ఫ్యూచర్ సిటీ డిపిఈఓ ఆధ్వర్యంలో స్థానిక ఎక్సైజ్ సిఐ బైద్యనాథ్ చౌహాన్ అధ్యక్షతన రెండు ద్విచక్రవాహనాలు, రెండు ఆటోలకు వాహనాలకు వేలం పాట నిర్వహించారు. నాలుగు వాహనాలకుగాను రూ. 1.22,133 రూపాయలు ఆదాయం వచ్చింది. అలాగే నాటుసారా, నల్లబెల్లం, పట్టిక, మధ్యం బాటిళ్ళ స్థానిక సురసముద్రం చెరువులో ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ అధికారులు పత్రిక ప్రకటనలో తెలిపారు.



నూతన డిటిడిఓ జనార్ధన్ సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

## విద్యార్థుల పట్ల శ్రద్ధవహించాలి

**డిటిడిఓ జనార్ధన్**

**కుల్కచర్ల, జులై 23, ప్రభాతవార్త:** విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా శ్రద్ధవహించాలని డిటిడిఓ జనార్ధన్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని బండవెల్కిచర్ల గిరిజన ఆశ్రమ పాఠశాలతో పాటు కుల్కచర్లగిరిజన ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. అనంతరం రికార్డు పరిశీలించి వంట గది, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా డిటిడిఓ జనార్ధన్ విద్యార్థుల పట్ల శ్రద్ధ వహించి అని సౌకర్యాలు కల్పించాలి సూచించారు. అనంతరం కుల్కచర్ల గిరిజన పాఠశాల ఉపాధ్యాయులు డిటిడిఓ జనార్ధన్‌ను ఘనంగా శాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## విద్యార్థులను అడ్డం పెట్టుకొని కాంగ్రెస్ రాజకీయం

**బిజెపి జిల్లా అధ్యక్షులు ప్రహ్లాద్‌రావు**





ముందస్తు అరెస్టు అయిన నేతలు

**కుల్కచర్ల, జులై 23, ప్రభాతవార్త:** విద్యార్థులను అడ్డం పెట్టుకోని కాంగ్రెస్ రాజ్యాకీయం చేయడం సారికాదని బిజెపి జిల్లా అధ్యక్షులు ప్రహ్లాద్‌రావు అన్నారు. ఢీల్లిలో నీట్ ఫేపర్ లిక్ అయిందని కాంగ్రెస్ నాయకులు రాహుల్ గాంధీ కార్యకర్తతో నరేంద్ర మోడీపై పలు అనుచిత వ్యాఖ్యలు చేసి ధర్నా నిర్వహించారు. ఈ మేరకు కాంగ్రెస్ నాయకులు చేస్తున్న కుట్రకు కుల్కచర్ల మండల బిజెపి నాయకులు నిరసన తెలుపుత్ను తరుణంలోపోలీసులు బిజెపి నేతలను ముందస్తు ఆరెస్ట్ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఆంజిలయ్య, మండల అధ్యక్షులు వెంకటేష్, ఉప సర్పంచ్ విజయ్ కుమార్, జిల్లా కన్వినర్ మహిపాల్, బిచ్చయ్య, మహేష్, నరేస్, లాలు తదితరులు పాల్గొన్నారు.

## మొక్కల భద్రత అందరి బాధ్యత

**జిల్లెడు చౌదరిగూడ, జులై 24, (ప్రభాతవార్త):** గ్రామంలో నాటిన మొక్కన భద్రత ప్రతి ఒక్కరు బాధ్యతగా తీసుకోవాలని జిల్లెడు చౌదరిగూడ మండలంలోని వాచ్చ్యతాండ సర్పంచ్ రవీందర్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ లక్ష్మీబాయి, తదితరులు పాల్గొన్నారు.

## గుంతల రోడ్డుతో ప్రజల అవస్థలు

**ఘట్‌కేసర్, జులై 24, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ డివిజన్ కెవల్‌ఆర్‌నగర్ రోడ్డు గుంతలు పడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వాహనాలతో నిత్యం రద్దీగా ఉండే ఈరోడ్డు నిర్వహణ అధ్వాన్నంగా తయారైంది. అధికారులు పట్టించుకోకపోవడంతో స్థానికులకు తిప్పలు తప్పడం లేదు. బిటి రోడ్డుపై నీరు చేరి గుంత ఏర్పడగా వాహనదారులు, పాదచారులు వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాల, కళాశాల బస్సులు, లారీలు, ఆటోలతో కెవల్‌ఆర్‌నగర్ రోడ్డు రద్దీగా ఉంటుండటంతో నీటి గుంతల నుంచి బురద చిల్లుతుంది. అధికారులు రోడ్డు నిర్వహణపై స్పందించడం లేదని స్థానికులు వాపోయారు. రాత్రి సమ యంలో ద్విచక్ర వాహన దారులు గుంతలో పడి గాయాల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డుపై గుంత పూడ్చి మరమ్మత్తు పనులు చేపట్టేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.



కెవల్‌ఆర్‌నగర్ రోడ్డుపై బురదకుంట ఏర్పడిన దృశ్యం

# దేవాలయాలు అధ్యాత్మిక కేంద్రాలు

**కీసర, జులై24, ప్రభాతవార్త:** దేవాలయాలు ఆధ్యాత్మిక కేంద్రాలని మేడ్చల్ నియోజకవర్గ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. శుక్రవారం కీసర సర్కిల్ పరిధిలోని చీర్యాల గ్రామంలో బొడ్రాయి (నాభిశిల) 15 వార్షికోత్స వంలో ఆయన పాల్గొన్నారు. వార్షికోత్సవం పురస్కరించుకుని స్వామివారికి హోమం, ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు తుంగ ధర్మేందర్, లావణ్య శ్రీని వాస్, మాజీ ఉపసర్పంచ్ జిల్లాల తిరుమల్‌రెడ్డి, మాజీ వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



చీర్యాల గ్రామంలో బొడ్రాయి వార్షికోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి

## ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్షిప్‌లు ప్రభుత్వం ఇచ్చే భిక్ష కాదు రాజ్యాంగబద్ధమైన హక్కు

**పెండింగ్ స్కాలర్షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలి**

**శంషాబాద్, జులై 24, ప్రభాతవార్త :** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఎబివిపి) రాష్ట్ర శాఖ పిలుపు మేరకు శుక్రవారం శంషాబాద్ జిల్లా ఆధ్వర్యంలో పెండింగ్‌లో ఉన్న స్కాలర్షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా శంషాబాద్ విభాగ్ కన్వీనర్ కోటి ప్రదీప్ మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులకు సంబంధించిన సుమారు రూ.11,000 కోట్ల స్కాలర్షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెండింగ్‌లో ఉండటం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. విద్యార్థుల హక్కులను కాలరాస్తూ ప్రభుత్వం వారి భవిష్యత్తుతో చెలగాటం ఆడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడింది విద్యార్థులకు నాణ్యమైన విద్య, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఆశయంతోనని, కానీ ప్రభుత్వాలు మారినా విద్యార్థుల సమస్యలు మాత్రం అలాగే కొనసాగుతున్నాయని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉచిత పథకాల కంటే విద్యార్థుల విద్యకు ప్రాధాన్యతనిస్తూ పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్షిప్‌లు ప్రభుత్వం ఇచ్చే భిక్ష కాదు... అవి విద్యార్థుల రాజ్యాంగబద్ధమైన హక్కుఅని స్పష్టం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి బకాయిలను విడుదల చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలను



శంషాబాద్‌లో నిరసన తెలుపుతున్న ఎబివిపి నాయకులు

మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

విద్యార్థుల సమస్యలను నిరక్ష్య్లం చేస్తూ రాజకీయ స్వార్థాల కోసం వారి జీవితాలతో చెలగాటం ఆడితే ఏబీవీపీ చూస్తూ ఊరుకోదని అన్నారు. ఈ కార్యక్రమంలో శంషాబాద్ జిల్లా కన్వీనర్ దార పవన్ కళ్యాణ్, కార్యవర్గ సభ్యులు భారత్, మహానగర్ కార్యవర్గ సభ్యులు సంజయ్, భారత్, వేణు, పవన్, తిరుపతితో పాటు పలువురు విద్యార్థి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సిఐ నరేందర్ రెడ్డికి ఘనంగా వీడ్కోలు

**శంషాబాద్, జులై 24, ప్రభాతవార్త :** శంషాబాద్ సిఐ నరేందర్ రెడ్డి చేవెళ్ల పోలీస్ స్టేషన్‌కు బదిలీ కావడంతో శుక్రవారం శంషాబాద్ పోలీస్ స్టేషన్‌లో భావోద్వేగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ సిబ్బంది, ఎస్సైలు, సీఐలు, కానిస్టేబుళ్లు భారీ సంఖ్యలో పాల్గొని ఆయనకు ఘనంగా వీడ్కోలు పలికారు. సీఐ నరేందర్ రెడ్డిని పూలమాలలు వేసి సన్మానించి, శాలువాతో సత్కరించారు. ఆయన సేవలను కొనియాడుతూ సహచర అధికారులు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా సిఐ నరేందర్ రెడ్డి మాట్లాడుతూ...తనతో కలిసి పనిచేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలుపుతూ, చేవెళ్ల పోలీస్ స్టేషన్‌లో కూడా ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందిస్తానని తెలిపారు. అనంతరం సహచరుల శుభాకాంక్షల నడుమ సిఐ నరేందర్ రెడ్డి శంషాబాద్ నుంచి చేవెళ్ల పోలీస్ స్టేషన్‌కు బయలుదేరారు.



బదిలిపై వెళ్తున్న ఇన్‌స్పెక్టర్ నరేందర్ రెడ్డిని సన్మానిస్తున్న సిబ్బంది



## మర్పల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

**మర్పల్లిలో కాంగ్రెస్ ధర్నా**

**మర్పల్లి, జులై 24, ప్రభాతవార్త :** ఢిల్లీలో నీట్ వ్యవహారంపై న్యాయం కోరుతూ ఆందోళన చేస్తున్న విద్యార్థులపైన పోలీసులు లాఠీచార్జ్ చేయడాన్ని, కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీలను అరెస్టు చేయడాన్ని ఖండిస్తూ శుక్రవారం నాడు మర్పల్లి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు భారీ ర్యాలీ నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షులు సురేష్ యాదవ్ అధ్వరంలో పార్టీ కార్యాలయం నుండి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించి రోడ్డుపై బైఠాయించి తమ నిరసనను తెలిపారు. ఈకార్యక్రమంలో మండల పార్టీ సీనియర్ నాయకులు మండలంలోని వివిద గ్రామాలనాయకులు సర్పంచ్‌లు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## నీట్ పేపర్ లీక్ నైతిక బాధ్యత కేంద్రానిదే

**: డివైఎఫ్ఐ**

**యాచారం, జులై 24, ప్రభాతవార్త:** నీట్ పేపర్ లీక్‌పై కేంద్ర ప్రభుత్వం నైతిక బాధ్యత వహించి కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర రాజీనామా చేయాలని డివైఎఫ్ఐ నాయకులు పెరుమాండ్ల లక్ష్మణ్ డిమాండ్ చేశారు. శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో బంద్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం నైతికబాధ్యాత తో కేంద్రమంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు ఎంతో శ్రద్ధతో చదువులు చదివితే కేంద్ర ప్రభుత్వం నిరక్ష్య వైఖరితో విద్యను వ్యాపారం చేయడం దురదృష్టకరం అన్నారు. కేంద్ర ప్రభుత్వం నిరక్ష్య్లం చేయకుండా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, విద్య వ్యవస్థ పై కఠినమైన చట్టాలు తీసుకువచ్చి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. బాధ్యులపై శిక్ష వేయకుంటే ఆందోలం తప్పదని హెచ్చరించారు.



స్కూల్ బంద్ చేయాలని వినతి పత్రం అందజేస్తున్న డివైఎఫ్ ఫై నాయకులు పి లక్ష్మణ్

**నీట్ పేపర్ లికేజీపై పూర్తి విచారణ జరిపి**

## విద్యార్థులకు న్యాయం చేయాలి

**మోమిన్‌పేట్, జులై 24. ప్రభాతవార్త:** డిల్లీలోని జంతర్ మంతర్ వద్ద విద్యార్థులు చేపట్టిన నిరసన కార్యక్రమంపై జరిగిన లాఠీచార్జ్‌ను తెలంగాణ సర్పంచుల ఐక్యవేదిక రాష్ట్ర మాజీ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, కోల్కుంద మాజీ సర్పంచ్ కొనింటి సురేష్ తీవ్రంగా ఖండించారు. శక్రవారం ఆయన ప్రభాతవార్తతో మాట్లాడుతూ ....విద్యార్థులు తమ సమస్యలను ప్రజాస్వామ్యబద్దంగా తెలియజేసే హక్కు భారతరాజ్యాంగం కల్పించిందని, అలాంటి విద్యార్థులపై బల ప్రయోగం చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్దమని ఆయన అన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం ప్రతి పౌరుడికి శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును కల్పిందని, ఆ హక్కును కాలరాయడం సరైనవిధానం కాదని పేర్కొన్నారు. విధ్యార్థులపై లాఠీచార్జ్ చేయకుండా, వారి డిమాండ్లను ఆలకించి సమస్యలకు పరిష్కారం చూపాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని అన్నారు. పేపర్ లికేజి ఆరోపణపై సమగ్ర విచారణ జరిపి, భాద్యులపై కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. విద్యా వ్యవస్థపై ప్రజల్లో నెలకొన్న అనుమానాలను నివృత్తి చేయడానికి కేంద్ర ప్రభుత్వం తక్షణ చర్యలు రేపట్టాలని, అవసరమైతే సంభందిత విద్యాశాఖ మంత్రి నైతిక భాధ్యత వహించి రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య విలువలను గౌరవిస్తూ విద్యార్థుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిగణలోకి తీసుకొని న్యాయం చేయాలని కొనింటి సురేష్ ప్రభుత్వాన్ని కోరారు.

**రాహుల్ గాంధీ చర్యలను ఖండిస్తూ**

## బిజెపి నాయకుల ఆందోళన

**వికారాబాద్, ప్రభాతవార్త :** కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ చేపట్టిన నిరసన చర్యలను తీవ్రంగా ఖండిస్తూ, శాంతియుతంగా నిరసన వ్యక్తం చేసిన తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షులు ఎన్.రామచంద్రరావు ను పోలీసులు అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ బీజేపీ నాయకులు శుక్రవారం పట్టణంలోని బీజేఆర్ చౌరస్తా వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా బీజేపీ, బీజేవైఎం నాయకులు మాట్లాడుతూ, దేశ అత్యున్నత రాజ్యాంగ పదవులకు, ప్రజాస్వామ్య సంప్రదాయాలకు విరుద్ధంగా వ్యవహరించే చర్యలు ప్రజాస్వామ్య విలువలను దెబ్బతీస్తాయని పేర్కొన్నారు. శాంతియుత నిరసన చేపట్టిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రామచంద్రరావు ని పోలీసులు అరెస్టు చేయడం ప్రజాస్వామ్య హక్కులను హరించే చర్య అని అన్నారు. నిరసనలో భాగంగా రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను బీజేపీ నాయకులు దగ్ధం చేశారు. అనంతరం ఆందోళన చేస్తున్న బీజేపీ, బీజేవైఎం నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కోఆర్డినేటర్ వద్ల నందు, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు చిట్యాల సాయిచరణ్ రెడ్డి, పరిగి నియోజకవర్గం ఇంచార్జి మారుతి కిరణ్, బీజేపీ సీనియర్ నాయకులు పాండు గౌడ్, శ్రీధర్ రెడ్డి, పి.శ్రీకాంత్ రెడ్డి, వికారాబాద్ పట్టణ అధ్యక్షురాలు యాష్కి శిరీష, కౌన్సిలర్లు అనిల్ యాదవ్, శ్యామ్ రెడ్డి, సురేందర్, వికారాబాద్ జిల్లా ఓబీసీ మోర్చా కోకన్వీనర్ ఆంజనేయులు, పెండ్లిమదుగు సర్పంచ్ బుచ్చయ్య, ధారూర్ స్టేషన్ సర్పంచ్ సోమ్లా నాయక్, రాళ్లగూడుపల్లి సర్పంచ్ మహిపాల్ వర్మ తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా జగన్నాథ రథయాత్ర

**ఘట్‌కేసర్, జులై 24, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్‌లో శుక్రవారం సాయంత్రం జగన్నాథ రథయాత్ర మహోత్సవం వైభవంగా జరిగింది. ఘట్‌కేసర్ డివిజన్ ఎన్ఎఫ్‌సీనగర్‌లోని కళ్యాణకామేశ్వరీ కోదండ రామాలయం నుంచి ప్రారంభమైన రథయాత్ర శివారెడ్డిగూడలోని ప్రసన్న వీరాంజనేయ మల్లికార్జునస్వామి ఆలయం వరకు కొనసాగింది. ఘట్‌కేసర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు బొక్క ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన జగన్నాథ రథయాత్రను మేడ్చల్ డిసిసి అధ్యక్షులు వజ్రేశ్‌యాదవ్ ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయనను సన్మానించారు. ఈసందర్భంగా శ్రీజగన్నాథస్వామి, బలభద్రుడు, సుభద్ర అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసి రథయాత్రను ప్రారంభించారు. అరటి, మామిడి తోరణాలు, పూలతో ప్రత్యేకంగా అలంకరించిన రథంపై ముగ్గురు మూర్తులను ఊరేగించారు. భక్తులు ఉత్సాహంగా రథం తాడుని పట్టుకొని ముందుకు లాగారు. భక్తుల హరేరామ సంకీర్తనతో ఎన్ఎఫ్‌సీనగర్ చౌరస్తా, బొక్కొనిగూడ చౌరస్తా, ఎదులాబాద్ రోడ్డు మీదుగా అంబేద్కర్ చౌరస్తా నుంచి శివారెడ్డిగూడ వరకు రథయాత్ర సాగింది. ఈసందర్భంగా పోలీసులు బందోబస్తు కల్పించి ట్రాఫిక్‌కు అంతరాయం కల్గకుండా చర్యలు తీసుకున్నారు. ఈకార్యక్రమంలో డిసిసి ఉపాధ్యక్షులు వేముల మహేశ్‌గౌడ్, మాజీ సర్పంచ్ మెడబోయిన వెంకటేశ్, మాజీ కౌన్సిలర్లు బొక్క సంగీత ప్రభాకర్‌రెడ్డి, చందుపట్ల వెంకట్‌రెడ్డి, బిజెపి జిల్లా మీడియాసెల్ కన్వీనర్ చలువాది ప్రవీణ్‌రావు, మాజీ ఎంపిటిసి నందం గణేశ్, మాజీ వార్డుసభ్యులు గడీల రామచంద్రారెడ్డి, బర్ల అంజనేయులు, కెవల్‌జి ప్రసాద్, చందుపట్ల లక్ష్మారెడ్డి, గద్దం వేణు, వేముల అనిల్‌కుమార్, సీతారాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



జగన్నాథ రథయాత్రలో పాల్గొన్న డిసిసి అధ్యక్షులు వజ్రేశ్‌యాదవ్



మొక్కలు నాటుతున్న సర్పంచ్, తదితరులు

## పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

**..సర్పంచ్ చెరుకుపల్లి బాల్‌రాజ్**

**పెద్దేముల్, జులై 24, ప్రభాతవార్త:** పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని సర్పంచ్ చెరుకుపల్లి బాల్‌రాజ్ పిలుపునిచ్చారు. శుక్రవారం పెద్దేముల్ మండలం రుక్మాపూర్ గ్రామ పంచాయతీ అధ్వర్యంలో పాఠశాలల, రహదారులకు ఇరువైపుల, ఖాళీ స్థలాలలో విస్తృతంగా మొక్కలను నాటారు. ఈ సందర్భంగా సర్పంచ్ సి.బాల్‌రాజ్ మాట్లాడుతూ గ్రామంలో పచ్చదనం నింపేందుకు ప్రత్యేక మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టామని అన్నారు. ప్రతి ఒక్కరు మొక్కలునాటి వాటిని సంరక్షించాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణతో పాటు స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన వాతావరణం కోసం చెట్ల పెంపకం ఎంతో అవసరమని అన్నారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించే బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని గుర్తు చేశారు. ప్రతి కుటుంబం కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షించాలని అన్నారు. వర్షపాతం పెరగడానికి, భూగర్భజలాలు నిల్వ ఉండటానికి మొక్కలు ఎంతో అవసరమని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శివలీల, ఫీల్డ్ అసిస్టెంట్ గోపాలక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.



గ్రామస్థులకు మొక్కలు అందజేస్తున్న సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు

## మక్తగూడలో హరిత విప్లవం

**కొత్తూర్, జులై 24, ప్రభాతవార్త:**

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని మక్తగూడ సర్పంచ్ బోకుల శ్రీరాములు పిలుపునిచ్చారు. శుక్రవారం కొత్తూరు మండలంలోని మక్తాగూడ గ్రామంలో పచ్చదనాన్ని పెంపొందించడమే లక్ష్యంగా పాలకవర్గ సభ్యులతో కలిసి ఇంటింటికీ ఆరు మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. మానవ మనుగడకు పర్యావరణ సమతుల్యత ఎంతో కీలకమని అన్నారు. మొక్కలు నాటడం మాత్రమే కాకుండా వాటిని సంరక్షించడం కూడా ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతా వరణాన్ని అందించేందుకు గ్రామస్తులందరూ మొక్కలను నాటి సం రక్షించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కాట్న రాజు, ఉప సర్పంచ్ రాములు గౌడ్, వార్డు సభ్యులు బోకుల రాజు, శ్రీను, నాయకులు లింగం, పాండు, శ్రీను, శ్రీశైలం, నరేష్, నజీర్, మల్లేష్, కుమార్, శేఖర్, ఖాదర్, చంద్రయ్య, కొమరమ్మ, సుజాత, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



బాలవికాస సిఎస్ఆర్‌బి ఫైజ్ 3.0 ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శౌరిరెడ్డి

## బాలవికాస సిఎస్ఆర్‌బి ఆధ్వర్యంలో ఫైజ్ 3.0 ప్రారంభం

**కీసర, జులై24, ప్రభాతవార్త:**

బాలవికాస సెంటర్ ఫర్ సోషల్ అండ్ రెస్పాన్సిబుల్ బిజినెస్ (బీవీ సీఎస్ఆర్ బీ) ఫైజ్ 3.0ని బాలవికాస అధ్యక్షులు ఇంద్రారెడ్డి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శౌరీరెడ్డిలు కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. మాజీ బోర్డు సభ్యులు రమణ గుప్తా సమక్షంలో ఫైజ్ 3.0 అధికారికంగా ప్రారంభించారు. బాలవికాస వ్యవస్థాపకులు బాలా థెరిసా జిన్గ్రాస్, అండ్రే జిన్‌గ్రాస్ వీడియో కాల్ ద్వారా సమావేశంలో పాల్గొని సామాజిక వ్యవస్థాపకులను తమ లక్ష్యం కోసం ఉత్తమమైనదని అందించాలని ప్రోత్సహించారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శౌరీరెడ్డి మాట్లాడుతూ బాలవికాస దార్శనికత, లక్ష్యం, సమాజ సేవలను వివరించారు. ప్రస్తుత కోహర్ట్‌లోని సంస్థలకు క్షేత్రస్థాయిలో మార్పు తీసుకురావడానికి సంస్థ ఎలా తోడ్పాటునందిస్తుందో వివరించారు. ప్రభావమే అసలైన కొలమానం, సామాజిక సంస్థలుగా, మీ పట్ల నిబద్ధతే శాశ్వత మార్పుకు సుస్థిరతకు దారి తీస్తుందన్నారు. ఫైజ్ 3.0 ధరఖాస్తుల అహ్వానానికి దేశ వ్యాప్తంగా అసారమైన స్పందన లభించిందన్నారు. 200కి పైగా సామాజిక వ్యాపార సంస్థల నుంచి ధరఖాస్తులు వచ్చాయన్నారు. కఠినమైన బహుల దశల అనంతరం 130కి పైగా సంస్థలను పిచింగ్ రౌండ్‌కు షార్ట్ లిస్ట్ చేయగా చివరకు మూడో బ్యాచ్‌కు 19 హామీనిచ్చే సామాజిక సంస్థలు ఎంపికయ్యాయన్నారు.

## ఢిల్లీలో విద్యార్థులపై దమన కాండకు నిరసనగా బిఆర్ఎస్వి ధర్నా



ఇందిరా పార్కు వద్ద ధర్నాలో పాల్గొన్న బిఆర్ఎస్‌వీ నాయకులు...

**దుద్యాల్, జులై 24, ప్రభాతవార్త:** హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద ఢిల్లీలో విద్యార్థులు, యువతపై కేంద్ర బీజేపీ ప్రభుత్వం కొనసాగిస్తున్న దమనకాండకు నిరసనగా బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి ఆదేశాల మేరకు కొడంగల్ తాలూకా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వం విద్యార్థుల ప్రజాస్వామ్య హక్కులను అణగదొక్కే చర్యలను ఖండిస్తూ నిరసన తెలిపారు. కార్యక్రమంలో తాలూకా వర్కింగ్ ప్రెసిడెంట్ మడిగె శ్రీనివాస్, మైనారిటీ అధ్యక్షులు జావీద్, యూత్ నాయకులు బొబ్బిలి నరేందర్, మహేందర్, రుద్రారం శ్రీనివాస్, నెహ్రూ నాయక్, శ్రావణ్‌తో పాటు టీఆర్ఎస్‌వీ విద్యార్థి నాయకులు పాల్గొన్నారు. విద్యార్థుల హక్కుల పరిరక్షణ కోసం పోరాటం కొనసాగుతుందని నాయకులు స్పష్టం చేశారు.

ప్రతిపక్షాల గొంతు నొక్కడమే లక్ష్యంగా

# ముందస్తు అరెస్టులు

బిజెపి నేతల ఆగ్రహం

**పెద్దేముల్,జులై 24, ప్రభాత వార్త:** ఢిల్లీలో బిజెపి కాంగ్రెస్ నాయకుల వైఖరికి వ్యతిరేకంగా శాంతియుతంగా నిరసన తెలపాలని నిర్ణయించిన భారతీయ జనతా పార్టీ నాయకులను తాండూరు నియోజక వర్గంలో పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేయడాన్ని బిజెపి రాష్ట్ర నాయకులు యు. రమేశ్ కుమార్ తీవ్రంగా ఖండించారు. ఈ ముందస్తు అరెస్టులు పూర్తిగా ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని ఆయన మండి పడ్డారు.శుక్రవారం ఉదయం 6:30 గంటలకే బిజెపి నాయకులు యు. రమేశ్ కుమార్‌ను ఆయన నివాసంలో పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. వారితో పాటు బిజెపి కౌన్సిలర్లు అంతరం కిరణ్, శ్రీకాంత్ రెడ్డి, కృష్ణ ముదిరాజ్, విజయ్ పటేల్, అంతరం లలిత, ప్రకాష్, షాబుద్దీన్‌లను తాండూర్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అలాగే పెద్దేముల్ మండలంలో బిజెపి అధ్యక్షులు వీరేశం, నాయకులు సందీప్ కుమార్, హరీష్ గౌడ్, యాదయ్య, వార్డు సభ్యుడు రవి తదితరులను కూడా పోలీసులు అరెస్ట్ చేశారు.భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి శాంతియుతంగా నిరసన తెలిపే ప్రాథమిక హక్కును కల్పించిందని రమేశ్ కుమార్ గుర్తుచేశారు. రాష్ట్రంలో ప్రభుత్వం తన వైఫల్యాలను బిజెపి ఎక్కడ ఎండగడుతుందోననే భయంతోనే ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకు పోలీసు వ్యవస్థను దుర్వినియోగం చేస్తోందని ఆరోపించారు. ముందస్తు అరెస్టుల పేరుతో రాజ్యాంగబద్ధమైన హక్కులను అడ్డుకోవడం ప్రజాస్వామ్య విలువలను కాలరాచడమేనని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులు, ప్రభుత్వం తక్షణమే ఇటువంటి అణచివేత చర్యలను మానుకోవాలని, అక్రమంగా అరెస్ట్ చేసిన బిజెపి నాయకులందరినీ వెంటనే బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

## రాహుల్ గాంధీ తీరుపై బిజెపి నిరసన

ధారూర్‌లో నేతల ముందస్తు అరెస్ట్




**ధారూర్, జులై 24, ప్రభాత వార్త:** నీట్ పరీక్ష ప్రశాంతంగా ముగిసినప్పటికీ, యువతను తప్పుదోవ పట్టించేలా నిరసనలు చేపడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గౌరవాన్ని, దేశ ప్రతిష్టను దిగజార్చేలా కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ వ్యవహరిస్తున్నారని మాజీ బిజెపి అధ్యక్షులు రమేష్ తీవ్రంగా మండిపడ్డారు. శుక్రవారం రాహుల్ గాంధీ వ్యాఖ్యలను ఖండిస్తూ నిరసనకు దిగాలనుకున్న బిజెపి నాయకులను ధారూర్ పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. ప్రధాని మోడీ,దేశ ప్రజల మనోభావాలను కించపరిచేలా వ్యవహరిస్తున్న తీరును ఎండగట్టాలని చూస్తే అరెస్టులతో అణచివేయాలని చూస్తున్నారని బిజెపి శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేశాయి.

## నాలుగవ రోజుకు చేరిన నిరాహార దీక్ష

**యాచారం, జులై 24, ప్రభాతవార్త:** యాచారం మండల పరిధిలోని మొండిగౌరెల్లి గ్రామంలో గత నాలుగు రోజుల నుండి రైతుల పక్షాన తెలంగాణ రాష్ట్ర భూముల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో జరుగుతున్న నిరాహార దీక్షలో భాగంగా శుక్రవారం యాచారం మండల తహసీల్దార్ అయ్యప్ప సందర్శించారు. ఇబ్రహీంపట్నం ఏసిపి కె పి వి రాజు రైతుల యొక్క డిమాండ్‌లు పై అధికారుల దృష్టికి తీసుకెళ్లి మీ సమస్యలు పరిష్కరించే విధంగా మేము కృషి చేస్తాము అని హామీ ఇవ్వడం వలన దీక్షలు విరమించారు.



దీక్ష కేంద్రంలో ప్రవీణ్‌తో మాట్లాడుతున్న తాసిల్దార్ అయ్యప్ప

## శాంతిభద్రతల పరిరక్షణకు కృషి

షాబాద్ ఇన్స్పెక్టర్‌గా డి.కె. లక్ష్మీరెడ్డి

**షాబాద్, జులై 24, ప్రభాతవార్త :** శాంతిభద్రతల పరిరక్షణకు అధిక ప్రాధాన్యం ఇస్తానని షాబాద్ ఇన్స్పెక్టర్ డి.కె. లక్షి మ్రెడ్డి అన్నారు. వీఆర్, సీపీవో, ఫ్యూచర్సిటీలో విధులు నిర్వహిస్తున్న డి.కె. లక్షి మ్రెడ్డి బదిలీపై షాబాద్ పోలీస్ ఇన్స్పెక్టర్గా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. షాబాద్ ఇన్స్పెక్టర్‌గా పనిచేసిన బి. కాంతారెడ్డి బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా డి.కె. లక్షి మ్రెడ్డి మాట్లాడుతూ... చట్టాన్ని అమలు పరుస్తూ ప్రజలకు న్యాయం చేయడమే పోలీసుల ప్రథమ కర్తవ్యమన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. తాను ప్రజలకు ఎప్పుడు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

## శిక్షణ కాలపు ఇఎల్స్ మంజూరు చేయాలని వినతి

**దుద్యాల్/బొంరాస్‌పేట్, జులై 24, ప్రభాతవార్త:** నిప్‌పుణ్ భారత్ శిక్షణలో పాల్గొన్న ఉపాధ్యాయులకు ప్రభుత్వం నిబంధనల ప్రకారం 5 రోజుల ఈఎల్స్ మంజూరు చేయాలని టీఎస్‌యూటీఎఫ్ బొంరాస్పేట్ మండల శాఖ డిమాండ్ చేసింది. ఈ మేరకు మండల విద్యాధికారి హరిలాల్‌కు వినతిపత్రం అందజేసింది. 2025 మే 20 నుంచి 24 వరకు ఎస్సీ ఈఆర్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణలో పాల్గొన్న అర్హులైన ఉపాధ్యాయులకు ఇప్పటికీ ఈఎల్స్ మంజూరు కాకపోవడం బాధాకరమని మండల అధ్యక్షులు గౌరారం గోపాల్ అన్నారు. వెంటనే అర్హులందరికీ ఈఎల్స్ మంజూరు చేసి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి శివరాజ్, ఉపాధ్యక్షులు రమేష్, కోశాధికారి సర్దార్ తదితరులు పాల్గొన్నారు.



ఎంఈఓ కు వినతిపత్రం ఇస్తున్న టీఎస్ యూటీఎఫ్ నాయకులు

## మైనర్ బాలికపై సాముహిక లైంగికదాడి

**కీసర, జులై 24, ప్రభాతవార్త:** ఓమైనర్ బాలికపై ముగ్గురు వ్యక్తులు లైంగికదాడికి పాల్పడిన సంఘటన కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మహారాష్ట్రకు చెందిన ఓబాలిక (13) చిన్నప్పుడే తల్లిదండ్రులు చనిపోవడంతో కీసరలో తన అమ్మమ్మ వద్ద కొన్నాళ్ల ఉంది. స్థానికుల సహాయంతో ఇటీవల యాదాద్రిభువనగిరి జిల్లా తుర్కపల్లిలోని వసతిగృహంలో చేరింది. ప్రస్తుతం 8వ తరగతి చదువుతుండగా ఇటీవల సెలవుల్లో అమ్మమ్మ వాళ్ల ఇంటికి వచ్చింది.

ఇంట్లో బాలిక ఒంటరిగా ఉన్న సమయంలో మేనమామతో పాటు వరుసకు సోదరులైన ఇద్దరు యువకులు గంజాయి మత్తులో బాలికపై లైంగిదాడికి పాల్పడినట్లు తెలిసింది. విషయం బయటకు రాకుండా జాగ్రత్తపడ్డారు. కాగా బాలిక తిరిగి వసతిగృహానికి వెళ్లగా తలకు ఫ్యాన్ తగిలి గాయమైంది. ఆసుపత్రిలో చికిత్స అనంతరం బాలిక ఇంటికి రావడంతో విషయం వెలుగులోకి వచ్చింది. నిందితులలో ఒకరిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నారు. కేసు దర్యాప్తులో ఉన్నందున పూర్తి వివరాలు త్వరలో తెలియజేస్తామని కీసర సిఐ అంజనేయులు తెలిపారు.

# ఇందిరమ్మ ఇండ్ల స్థలాలు కాగితాలకే పరిమితమా.?

-సిపిఎం చిన్నతుండ్ల గ్రామ కమిటీ

**యాచారం, జులై24, ప్రభాతవార్త :** భారత కమ్యూనిస్టు పార్టీ ( మార్క్సిస్టు ) , చిన్నతుండ్ల గ్రామ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక యాచారం తహసీల్దార్ అయ్యప్పకి చిన్నతుండ్ల గ్రామంలోని 327 సర్వే నెంబర్లో గల 5 ఎకరాల 10 గుంటల భూమి గతంలో 1983 లో 121 గజాల చొప్పున ఇండ్ల స్థలాలు ఇవ్వడం జరిగింది అలాగే 2006లో మాజీ మంత్రి సబిత ఇంద్రా రెడ్డి , మాజీ ఎమ్మెల్యే మస్కు నర్సింహ సమక్షంలో అట్టి 121గజాల స్థలం కాస్త 60గజాల కు కుదించి 167 మందికి పట్టాసర్టిఫికెట్లు కూడా ఇవ్వడం జరిగిందని అన్నారు.

కానీ నేటికీ ఆ యొక్క స్థలాలు కాగితాలకే పరి మితమైన తప్ప పేదవారికి చెందలేదు. గతంలో కిషన్‌రెడ్డి ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు వారికి కూడా వినతి పత్రం ఇవ్వడం జరిగింది వారు కూడా సానుకూలంగా స్పందించి ఇళ్ల జాగలు ఇస్తామని హామీ ఇవ్వడం జరిగింది ,ఇప్పుడు ఉన్నటువంటి శాసనసభ్యులు మల్రెడ్డి రంగారెడ్డి కూడా ఎన్నికల సమయంలో గెలిచిన ఆరునెలల సమయంలోనే ఆ యొక్క భూమిలో పేదవారికి ఇండ్ల స్థలాలు చూపించి ఇందిరమ్మ ఇండ్లు కట్టిస్తామని హామీ ఇవ్వడం జరిగింది.



తహసీల్దార్ అయ్యప్ప కు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

అందుకు ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి హామీ నిలబెట్టుకోవాలని పేద ప్రజల తరుపున సిపిఎం పార్టీ కోరుతుందన్నారు . అనేకసార్లు కేవలం వినతి పత్రాలకు , హామీలకే పరి మితం అవుతున్నవి కానీ పేదవారికి మాత్రం ఇండ్ల జాగలు ఇవ్వడంలో ప్రతి ప్రభుత్వం విఫలం అవుతూనే ఉన్నాయన్నారు.

ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఆ ఐదు ఎకరాల 10 గుంటలలో పేదవారికి ఇంటి జాగాలు చూపించి ఇందిరమ్మ ఇల్లు కట్టించాలని భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు సిపిఎం డిమాండ్ చేస్తున్నామని అన్నారు. లేనిపక్షంలో మరోసారి పేద ప్రజల కోసం కేటాయించిన ఇండ్ల స్థలాలు పేదలకు ఇచెంతవరకు సిపిఎం పార్టీ పోరాటానికి సిద్ధంగా ఉందని తెలియజేస్తున్నన్ని మని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఇండ్ల స్థలాల కోసం సోమవారం రోజు చలో కలెక్టరేట్ పిలుపు ఇవ్వడం జరిగింది గుర్తు చేశారు.

ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ శాఖ కార్యదర్శులు మస్కు మహేందర్ , మస్కు భగత్, సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు విజయ్ కుమార్,సామర్తి జగన్ , కే వినోద్ కుమార్, నాగని నరసింహ, బోర్ర కుమార్, సామర్తి సత్తయ్య, నాగని అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల భవిష్యత్తుకు సర్పంచ్ చేయూత

-భావిభారత రథసారథులు మీరే: సర్పంచ్ చిట్టెడి నరసింహారెడ్డి

**కొత్తూర్, జులై 24, ప్రభాతవార్త:** ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల సంక్షేమం, ఉజ్వల భవిష్యత్తు కోసం తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందిస్తానని మల్లాపూర్ సర్పంచ్ చిట్టెడి నరసింహారెడ్డి తెలిపారు. కొత్తూరు మండలం మల్లాపూర్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం కట్టెల పొయ్యిపై వండుతున్న విషయాన్ని గమనించిన సర్పంచ్ చిట్టెడి నరసింహారెడ్డి స్పందించారు. విద్యార్థులు, వంట సిబ్బంది పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని పాఠశాలకు గ్యాస్ స్టవ్‌తో పాటు గ్యాస్ సిలిండర్‌ను తన సొంత ఖర్చుతో విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు కష్టపడి చదివి భావిభారత రథసారథులుగా ఎదగాలని ఆకాంక్షి ంచారు. విద్యార్థులకు మెరుగైన వాతావరణం కల్పించేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని కోరారు. పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల సంక్షేమానికి భవిష్యత్తులోనూ అవసరమైన సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. గ్యాస్ స్టవ్, సిలిండర్ అందజేసిన సర్పంచ్‌కు పాఠశాల ఉపాధ్యాయులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి విక్రమ్‌రెడ్డి, నాయకులు పాపిరెడ్డి, జయేందర్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, సుభాష్‌రెడ్డి, కమల్‌రెడ్డి, అంగన్‌వాడీ టీచర్లు సునీత, వెంకటేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పాఠశాలకు గ్యాస్ స్టవ్,సిలిండర్‌ను అందజేస్తున్న సర్పంచ్ చిట్టెడి నరసింహారెడ్డి

# ప్రజల జీవనాధారంపై డంపింగ్ యార్డు దాడి

-సిద్ధాపూర్ జీవో 641ను రద్దు చేయాలి

-బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడికి బీజేవైఎం నేతలు వినతి

**కొత్తూరు, జులై 24 (ప్రభాతవార్త):**

సిద్ధాపూర్‌లో ప్రతిపాదించిన డంపింగ్ యార్డుకు సంబంధించిన జీవో నంబర్ 641ను వెంటనే రద్దు చేయాలని కోరుతూ బీజేవైఎం కొత్తూరు మండల అధ్యక్షుడు అంబటి శ్రీశైలం ఆధ్వర్యంలో తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావుకు వినతిపత్రం అందజేశారు.సిద్ధాపూర్‌లో డంపింగ్ యార్డు ఏర్పాటు చేస్తే ప్రజల జీవనాధారం దెబ్బతినడంతో పాటు పర్యావరణం, వ్యవసాయం, పశుపోషణపై తీవ్ర ప్రభావం పడుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. డంపింగ్ యార్డు వల్ల పరిసర ప్రాంతాల ప్రజల ఆరోగ్యాలు ప్రమాదంలో పడే అవకాశం ఉందన్నారు. గత ప్రభుత్వం సిద్ధాపూర్ ప్రాంతంలోని భూములను ఐటీ హబ్, ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు కోసం సేకరించగా, ప్రస్తుతం డంపింగ్ యార్డు ఏర్పాటు కోసం జీవో జారీ చేయడం సరికాదన్నారు.

ప్రతిపాదిత ప్రాంతంలో సుమారు 30 ఎకరాల విస్తీర్ణంలో గొట్ల చెరువు ఉందని, ఈ చెరువుపైనే స్థానిక ప్రజల వ్యవసాయం, పశుపోషణ ఆధారపడి ఉందని తెలిపారు. డంపింగ్ యార్డు ప్రతిపాదిత స్థలానికి సుమారు 50 గ్రామాలు సమీపంలో ఉన్నందున ప్రజల ఆరోగ్యాలు, జీవనోపాధిపై తీవ్ర ప్రభావం పడే ప్రమాదం ఉందన్నారు. ప్రజల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, జీవో నంబర్ 641 రద్దు కోసం ఒత్తిడి తీసుకురావాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావును, బిజెపి పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు రాజగోపాల్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నెల్లి శ్రీ వర్ధన్ రెడ్డి, మంగలి రమేష్ తోపాటు పలువురు బిజెపి సీనియర్ నాయకులు కోరారు.



రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు రామంచదర్ రావుకు వినతిపత్రం అందజేస్తున్న బీజేవైఎం నేతలు

## మై భారత్ లక్ష్యాలను సాధించాలి

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జులై 24, ప్రభాతవార్త:**

మై భారత్ పోర్టల్‌పై విస్తృతంగా ప్రచారం చేయాలని,.యువతకు అవగాహన కల్పించాలని, జిల్లాలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ విభాగాలు, విద్యా సంస్థలు, యువజన సంఘాలు, ఇతర భాగస్వాములు ఉమ్మడిగా కమిటీలు అన్ని కలిసి పనిచేసి మై భారత్ లక్ష్యాలను సాధించాలని మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ పిలుపునిచ్చారు. శుక్రవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లోని విసి హాల్‌లో భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు,క్రీడల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన మై భారత్ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా మై భారత్ కార్యక్రమాల సమన్వయం,పర్యవేక్షణ, సమర్థవంతమైన అమలును సులభతరం చేయటానికి జిల్లా కలెక్టర్ ఆమోదంతో జిల్లా సలహా కమిటీ (డిఎసి), జిల్లా సమన్వయ కమిటీ (డిఎస్‌సి)లను ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. మైభారత్ పోర్టల్‌లో 15నుంచి 29సంవత్సరాల మధ్య వయస్సు గల యువతకు స్వచ్ఛంధ సేవ, నాయకత్వ అభివృద్ధి, నైపుణ్యాల పెంపు, ఇంటర్న్‌షిప్‌లు, దేశ నిర్మాణంలో చురుకైన భాగస్వామ్యం కోసం మై భారత్ పోర్టల్‌లో తమ పేర్లను రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. జిల్లాకు 80,044మంది యువత రిజిస్ట్రేషన్‌ను లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు. కలెక్టరేట్‌లోని వివిధ శాఖల వారీగ యువత రిజిస్ట్రేషన్ లక్ష్యాన్ని కేటాయించి నిర్దేశిత కాలపరిమితిలోగా పూర్తి చేయాలని ఆయన సూచించారు. జిల్లాలో మై భారత్ నమోదు అవగాహన కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగ అమలు చేయటానికి సంబంధిత శాఖలు, సంస్థల భాగస్వాముల సమన్వయంతో పూర్తి చేయాలన్నారు. జిల్లాలోని అర్హులైన ప్రతి యువకుడు మై భారత్ పోర్టల్‌లో నమోదు అయ్యేలా విద్యా సంస్థలు, పట్టణ స్థానిక సంస్థలు, ఎన్ఎస్ఎస్, ఎన్‌సిసి, భారత్ స్కౌట్స్,గైడ్స్, యూత్ క్లబ్‌లు, స్వయం సహాయక బృందాలు ఇతర సామాజిక సంస్థల ద్వారా అవగాహన ప్రచారాలు, నమోదుకు శిబిరాలు విస్తరణ కార్యక్రమాలను నిర్వహించాలని సంబంధిత శాఖల అధికారులకు జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ ఆదేశించారు. కళాశాలలు, విశ్వవిద్యాలయాలు, పాలిటెక్నిక్‌ల, పాఠశాలలు, పురపాలక సంఘాల వారు నమోదుకు శిబిరాలను నిర్వహించి అవగాహన కల్పించాలని, ప్రచారం కూడ నిర్వహించాలన్నారు. జిల్లా మైభారత్ డిడి, జిల్లా సలహా కమిటీ సభ కార్యదర్శి బి.స్నేహల్ జ్ఞానేశ్వర్ బసుత్కర్ మై భారత్ రిజిస్ట్రేషన్ అవగాహన కార్యక్రమం లక్ష్యాల గురించి వివరించారు. ఆ తరువాత వికసిత్ భారత్ పోస్టర్‌ను జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ వారితో కలిసి ఆవిష్కరించారు.



మైభారత్ లక్ష్యాల సాదన వికసిత్ భారత్ పోస్టర్‌ను ఆవిష్కరించిన మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్,పాల్గొన్న అధికారుల,తదితరుల దృశ్యం

# కేంద్ర ప్రభుత్వ కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకువెళ్లాలి



షాబాద్‌లో రాహుల్ గాంధీ, సిఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మలను దగ్ధం చేస్తున్న బీజేపీ నాయకులు

**షాబాద్, జులై 24, ప్రభాతవార్త :** కేంద్ర ప్రభుత్వ కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకువెళ్లాలని బీజేపీ మండల అధ్యక్షుడు మద్దూరి మాణయ్య అన్నారు. శుక్రవారం దేశ ప్రధాని నరేంద్రమోదీ ఇంటి ముందు దర్నాకు నిరసనగా కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దేశం, రాష్ట్ర ప్రయోజనాల కోసం బీజేపీ ప్రజాస్వామ్య బద్ధంగా నిరసన వ్యక్తం చేస్తున్నామన్నారు. ప్రజల్లో అపోహలు, తప్పుడు ప్రచారాలు వ్యాప్తి చెందకుండా ప్రతి కార్యకర్త సోషల్ మీడియా వేదికలను సమర్థవంతంగా వినియోగించి పార్టీ సిద్ధాంతాలు, కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు, వాస్తవ సమాచారాన్ని ప్రజలకు చేరవేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛభారత్ సెల్ రాష్ట్ర కన్వీనర్ రాము, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మహేందర్, నాయకులు రాజీవ్ రెడ్డి, గూడెం రమేష్, మహేందర్, సందీప్ కుమార్ గౌడ్, రవీందర్ గౌడ్, మహేష్, నరేష్, కృష్ణచారి, క్యామ నారాయణ, శేఖర్, వినయ్, విఫిక్, నర్సింహులు, నరేష్ గౌడ్, విష్ణు, మాధవచారి, గోవర్దన్, రవి. అశోక్, రాకేష్, మల్లేష్, విజయ్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

# స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా జి.అరుణజ్యోతి

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జులై 24, ప్రభాతవార్త:**

మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా స్కూల్ గేమన ఫెడరేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా జి.అరుణ జ్యోతి నియమితులయ్యారు. శుక్రవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లోని డిఇఓ కార్యాలయంలో డిఇఓ రేణుకాదేవి నుంచి జి.అరుణజ్యోతి ఎస్‌జిఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీగా నియామకపత్రాన్ని అందుకున్నారు. జిల్లాలోని కుత్బుల్లాపూర్ మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సీనియర్ స్కూల్ అసిస్టెంట్‌గా (ఫిజికల్ ఎద్యుకేషన్), ఎస్ఎ, పిడిగా ఆస్కూల్‌లో విధులు నిర్వహిస్తున్నారు. అయితే 2026-2028విద్యాసంవత్సరానికి గాను జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఆమె బాధ్యతలు నిర్వహించనున్నారు. ఎస్‌జిఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ పదవి కోసం నామినేషన్ దాఖలు చేయటంతో ఆమెను నియమించారు. మేడ్చల్ జిల్లా విద్యాశాఖ అధికారి రేణుకాదేవి ఈ మేరకు ఆమెను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసి అందజేశారు. జిల్లాలోని పలువురు పిడిలు, పిఇటిలు జి.అరుణజ్యోతిని అభినందించారు. ఆ తరువాత డిఇఓ రేణుకాదేవి జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీగా నియమితులైన జి.అరుణజ్యోతిని అభినందించారు. జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీగా నియమితులైన జి.అరుణజ్యోతితో పాటు పలువురు పిడిలు, పిఇటిలు పాల్గొని డిఇఓ రేణుకాదేవిని సన్మానించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎం ప్రభాకర్, మాజీ కార్యదర్శి కిష్టయ్య, ఫిజికల్ డైరక్టర్లు గోనె కవితరాణి, గోనె మదన్మోహన్‌రెడ్డి, జి.సత్తిరెడ్డి, నాగరాజు, వివిధ పాఠశాలల పిడిలు, పిఇటిలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లోని డిఇఓ కార్యాలయంలో జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా జి.అరుణజ్యోతికి నియామకపత్రాన్ని అందజేసిన డిఇఓ రేణుకాదేవి,పాల్గొన్న తదితరుల దృశ్యం

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

**కేశంపేట, జులై 24, ప్రభాతవార్త :** కేశంపేట మండల పరిధి లోని లింగందన గ్రామానికి చెందిన నెల్లికంటి శంకరయ్య శుక్రవారం తెల్లవారు జామున ఆకస్మికంగా మృతిచెందాడు.మృతి చెందిన విషయాన్నీ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుల ద్వారా తెలుసుకున్న కేశంపేట తాజా మాజీ జడ్పిటిసీ తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి మృతుడి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేస్తూ అంత్య క్రియల ఖర్చుల నిమిత్తం 5000 వేల రూపాయలను, వారితో పాటు ఎన్ ఆర్ ఐ ఎడమ శ్రీనివాస్ రెడ్డి 8000 వేల రూపాయలను గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుల ద్వారా మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులు మాట్లాడుతూ గొప్ప మనసుతో ఆర్థిక సాయం అందించిన మాజీ జెడ్పిటిసి విశాలాశ్రమం రెడ్డికి ఎన్ ఆర్ ఐ శ్రీనివాసరెడ్డికి ఆర్థిక సాయం అందించేందుకు కృషి చేసిన గ్రామ కాంగ్రెస్ నాయకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కేశంపేట మండల ప్రధాన కార్యదర్శి బండేలా రాజేందర్ రెడ్డి,ఏసీ సెల్ మండల అధ్యక్షుడు నాగిళ్ళ భాస్కర్, మాజీ సర్పంచ్ కృష్ణయ్య గౌడ్, నాగిళ్ళ పురుషోత్తం, గ్రామ కమిటీ అధ్యక్షుడు బాలయ్య, వార్డు సభ్యులు లింగం, గుమ్మడయ్య, బాలయ్య, మంగలి వెంకటయ్య, సప్పిడు చెంద్రయ్య, ఎన్ నరసిమ్మ, ఎన్ నేహురు, రాజు, మల్లయ్య చెన్నయ్య కృష్ణ, నాగరాజు రమేష్ వినయ్ రామకృష్ణ,శివ, గొడుగు ఆనంద్, మంగలి హరీష్, ఎన్ శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

## విద్యాసంస్థల బంద్ విజయవంతం

**షాబాద్, జులై 24, ప్రభాతవార్త :** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీట్ పేపర్ లీకేజీ ఘటనపై కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ తెలంగాణ వ్యాప్తంగా విద్యార్థి సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు షాబాద్ మండలంలో విద్యాసంస్థల బంద్ విజయవం తమైందని ఎస్ఎఫ్ఐ షాబాద్ మండల కమిటీ సభ్యుడు రాముయాదవ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఢిల్లీలో విద్యార్థులపై జరిగిన దాడులపై విచారణ జరిపించాలని, నీట్ పేపర్ లీక్ అవ్వడం వల్ల చనిపోయిన విద్యార్థుల కుటుంబాలకు రూ. కోటి చొప్పున నష్టపరిహారం అందించాలన్నారు. దీనికి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్రప్రధాన్‌వెంటనే రాజీనామ చేయాలన్నారు. ఎన్టీఏ రద్దు చేసి, వీబీఎస్ఏ బిల్లు వెనక్కి తీసుకోవాలన్నారు. కేంద్రంలో, రాష్ట్రంలో విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సిద్ధి, తేజ, అనిల్ యాదవ్, విద్యార్థులు ఉన్నారు.



జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న బిజెపి నేతలు

## పార్టీ అభ్యున్నతికి ప్రతి కార్యకర్త పాటు పడాలి

**మేడ్చల్, జులై 24, ప్రభాతవార్త :** పార్టీ అభ్యున్నతికి ప్రతి కార్యకర్త కంకణబద్ధుడై పని చేయాలని బిజెపి మేడ్చల్ మున్సిపల్ ఇంచార్జ్ విక్రంరెడ్డి అన్నారు. మేడ్చల్ మున్సిపల్ బిజెపి అధ్యక్షురాలు జల్లి శైలజ హరినాథ్ ఆధ్వర్యంలో పార్టీ కార్యవర్గ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ రానున్న రోజుల్లో పార్టీని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని, ప్రతి కార్యకర్త బూత్ స్థాయిలో ఎస్ఐఆర్ సమీక్ష నిర్వహించా లని తెలిపారు. ఐకమత్యంతో ముందుకు సాగి వచ్చే ఎన్నికల్లో బిజెపి జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు. ఎవరెన్ని కుట్రలు చేసినా దేశం కోసం పాటు పడే పార్టీ బిజెపి అని అన్నారు. అనంతరం శైలజ మాట్లాడుతూ మేడ్చల్‌లో అస్త వ్యస్తమైన రోడ్లు, డ్రైనేజ్ వ్యవస్థతో పాటు ఏ సమస్య కూడా పరిష్కారం కావడం లేదని ప్రభుత్వంపై మండి పడ్డారు. కార్యక్రమంలో మేడ్చల్ రూరల్ జిల్లా బిజెపి ఉపాధ్యక్షుడు పాతూరి ప్రభాకర్ రెడ్డి, జిల్లా కోశాధికారి లవంగ శ్రీకాంత్, మేడ్చల్ రూరల్ జిల్లా బిజెవైఎం అధ్యక్షుడు రాగం అర్జున్, సీనియర్ నాయకులు రామన్నగారి శ్రీనివాస్ గౌడ్, పాతూరి సుధాకర్ రెడ్డి, మాజీ సర్పంచ్‌లు మురళీ గుప్త, నరసింహ రెడ్డి, మేడ్చల్ రూరల్ జిల్లా బిజెవైఎం కార్యదర్శి రాఘవ రెడ్డి, మేడ్చల్ మున్సిపల్ ప్రధాన కార్యదర్శులు వంశీ విజయ్ వంజరి, జకట ప్రేందాస్, కోశాధికారి ఉపేందర్ గుప్త,ఉపాధ్యక్షులు మైసరి రాజు వంజరి, సర్వేశ్వర రెడ్డి, మల్లేష్ యాదవ్, దోసడి రామచంద్ర రెడ్డి, కార్యదర్శులు సత్యనారాయణ రెడ్డి, బండి విష్ణు గౌడ్, డీ.సాయి. నాయకులు రాజు, ధాత్రిక లక్ష్మణ్ వంజరి, నర్సింగ్, చీర్ల సత్యనారాయణ, చెరువుకొమ్ము శ్రీనివాస్ గౌడ్, కృష్ణప్రియ మల్లారెడ్డి, వంశీ రెడ్డి, నర్సింగ్, మల్లికార్జున్, జకట బాబు రాజు, మహేష్ గౌలికర్, నర్సింగ్, నరేందర్, అవినాష్ చారి, కేశవరెడ్డి, అర్జున్, రథన్, అనిత శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించాలి

**జిల్లెడు చౌదరిగూడ,జులై 24,(ప్రభాతవార్త):** కెజిబివి, యుఆర్ఎస్, ఎస్ఎస్ఎ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని టీఎస్‌యూటిఎఫ్ జిల్లా కార్యదర్శి శివారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని కెజిబివి పాఠశాలలో టీఎస్‌యూటిఎఫ్ రాష్ట్ర కమిటి పిలుపు మేరకు పోస్టుకార్డు క్యాంపెయిన్ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిఎస్‌యూటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి రాములు, స్వర్ణలత, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.